నేడు అన్నదానం

మోతీనగర్ : మూసాపేట డివిజన్ మోతీనగర్ చౌరస్తాలో జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్- 2025

మోతీనగర్: స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్-2025 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్ డాక్టర్ ఈఎస్ సూర్యనారాయణ, సూర్యతేజ సుబ్రాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన వారికి ఆల్ ది బెస్ట్ అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నాట్య గురువులకు నాట్య గురు రత్న అవార్డులు సైతం అందజేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు



మూసాపేట: బీఆర్ఎస్ కూకట్‌పల్లి డివిజన్ నాయకులు ఆసిఫ్‌ఖాన్ శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బండి రమేశ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బండి రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నుపాషా, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గడ్డం రత్న కిషోర్‌కు రూ. 2.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలాలి

– ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున్న తరలిరావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. వరంగల్ ఎల్కతుర్తి వద్ద జరిగే భారీ బహిరంగ సభకు అన్ని డివిజన్లలోని అన్ని కాలనీలు, బస్తీల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కాల సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.
– ఓల్డ్ బోయిన్‌పల్లి

ఉగ్రదాడిపై ప్రజాగ్రహం

- నిరసన వెల్లువ
- ర్యాలీలో పీఏసీ చైర్మన్ గాంధీ, సినీనటుడు రాజేంద్రప్రసాద్
- మృతులకు ఘన నివాళి

కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు





ర్యాలీలో పాల్గొన్న సినీనటుడు రాజేంద్రప్రసాద్ తదితరులు



ర్యాలీలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, కాలనీల ప్రజలు

ఆల్విన్‌కాలనీ:

పర్యాటకులపై ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. డివిజన్‌లోని ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఈ దుశ్చర్య దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీలో సినీనటుడు రాజేంద్రప్రసాద్

కూకట్ పల్లి : ఉగ్రదాడిని ఖండిస్తూ కూకట్‌పల్లి ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్‌లో శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సినీ నటుడు రాజేంద్రప్రసాద్, రెసిడెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అసోసియేషన్ క్లబ్ హౌస్ నుంచి హైటెక్ సిటీ- కూకట్‌పల్లి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ కొనసాగింది. భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

క్యాండిల్ ర్యాలీ

ఓల్డ్ బోయిన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కు పాదం మోపి ఉగ్రవాదం అనేది లేకుండా చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. యాత్రికులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. శనివారం సాయంత్రం ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా నుంచి హస్మత్‌పేట్ చౌరస్తా మీదుగా దుబాయిగేట్ వైష్ణవిమాతా దేవాలయం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నర్సింగ్‌రావు, కుమ్మరి బాలరాజు, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, కృష్ణాయాదవ్, ఇర్ఫాన్, లలిత, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి వివిధ కోర్సులు



కోర్సుల వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ విశాల్ తల్వార్

గచ్చిబౌలి: యూకేలోని అగ్రశ్రేణి రసెల్స్ గ్రూపు విశ్వవిద్యాలయాల్లో ఒకటైన సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీలో త్వరలో వివిధ రకాల కోర్సులు అందుబాటులో ఉంటాయని సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విశాల్ తల్వార్ తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్ హోటల్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ అకడమిక్ డిస్కవరీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ..గుర్‌గావ్ కేంద్రంగా పని చేస్తున్న సౌతాంప్టన్ ఢిల్లీ యూనివర్సిటీలో ఆగస్టు-2025లో కోర్సులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. యూకే తరహా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో బీఎస్సీ అకౌంటింగ్, ఫైనాన్స్, బీఎస్సీ ఎకనామిక్స్, బీఎస్సీ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్, ఎంఎస్సీ ఫైనాన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ ఉంటాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్యూస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో టాప్ 100, గ్రాడ్యుయేట్ ఉపాధిలో టాప్ 125లో నిలిచిందన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యు యేట్ ప్రోగ్రాంల కోసం ఢిల్లీ ప్రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్‌లు, ఫ్యూచర్ టాలెంట్ స్కాలర్‌షిప్‌లను ప్రవేశపెట్టామని వివరించారు. దరఖాస్తుల కోసం ఎర్లీబర్డ్ డెడ్‌లైన్‌గా ఏప్రిల్ 28గా నిర్ణయించామన్నారు.

సభను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో కార్పొరేటర్ నర్సింహయాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు

ఓల్డ్ బోయిన్‌పల్లి : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కర్రె జంగయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, సయ్యద్ ఏజాజ్, మల్లేష్ యాదవ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి, బాలరాజు, మక్కాల సత్యనారాయణ, ఖాదీర్, మట్టి శ్రీను, పిట్ల రాజు, రాజుగౌడ్, వెంకటేశ్, నాగేష్, కుమ్మరి బాలరాజు, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ గౌతంకుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతం కుమార్

సుభాష్‌నగర్: భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ గౌతం కుమార్ అన్నారు. శనివారం దుండిగల్ మండలం బహదూర్‌పల్లిలో మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో మీరు దరఖాస్తులు ఇస్తే వాటికి శాశ్వత, సత్వర పరిష్కారం ఉంటుందన్నారు. భూభారతి పరిధిలో లేని సమస్యలకు తగు సూచనలు రెవెన్యూ అధికారులు ఇస్తారని అన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా అన్ని చట్టాలను కలిపి సింగిల్ రెవెన్యూ చట్టం త్వరలోనే తేవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా అన్ని శాఖల సమన్వయంతో ఎన్‌క్రోచ్‌మెంట్ సమస్యల పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేత



శాంతి ర్యాలీకి ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న పాస్టర్స్

ఆల్విన్‌కాలనీ: ఉగ్రవాద దాడులను నిరసిస్తూ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పీస్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ర్యాలీకి హాజరవ్వాలని సంఘం ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఆహ్వానించారు. మియాపూర్ క్రాస్ రోడ్డు నుంచి జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి మెట్రో పార్కు ట్రక్కు పార్కు గ్రౌండ్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ హెడ్‌వార్డు రాస్, యేసుపాదం, కొమ్ముసాగర్, మాణిక్యం, తెట్టబావి ఆనంద్, డేవిడ్ పాల్గొన్నారు.

నేడు యోగా సెంటర్ 10వ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లోని ఎంఎల్ఎన్ గార్డెన్‌లో ఆదివారం నిర్మల సాధన జ్యోతి మందిర్ 10వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు చంద్రశేఖర్ బ్రాంచ్ ఇన్‌చార్జి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగా గురువు నరేంద్ర బందూజీ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగుతుందన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలి



ట్రేడ్ లైసెన్స్ గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోతీనగర్: ప్రతి దుకాణాదారుడు, స్ట్రీట్ వెండర్స్ ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని, తీసుకోకుంటే చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ పూర్వ మోతీనగర్ ఏరియా ఏఎస్ఆర్‌పీ వడ్ల సురేశ్ చారి అన్నారు. శనివారం సర్కిల్ పరిధిలోని అల్లాపూర్ డివిజన్‌లో శ్రీ వివేకానందనగర్, గాయత్రినగర్, పర్వత్‌నగర్, తులసీనగర్‌లలో గల ప్రతి దుకాణం స్ట్రీట్ వెండర్స్ షాపులను తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారు తక్షణమే దరఖాస్తు చేసి పొందాలని సూచించారు. అదేవిధంగా ప్లాస్టిక్ కవర్లను వాడకుండా నాణ్యమైన కవర్లనే వాడాలని సూచించారు. ప్రతి స్ట్రీట్ వెండర్స్ తమ దుకాణం పరిసరాల చుట్టు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జవాన్ యాదగిరి, ఎస్ఎఫ్ఏ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మూతలు ఏర్పాటు చేయరూ!



మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో డ్రైనేజీలైన్ మ్యాన్‌హోల్‌కు మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కమ్యూనిటీహాల్‌కు వెళ్లే దారిలో రెండు మ్యాన్‌హోళ్లకు మూతలు లేవు. కొన్ని రోజులుగా ఇలాగే ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీహాల్‌లోని అంగన్‌వాడీకి చిన్నారులు, బాలింతలు, బస్తీ దవాఖాణాకు వృద్ధులు వస్తుంటారు. పొరపాటున మ్యాన్‌హోల్‌లో పడే అవకాశం ఉంది. స్థానికులు కూడా రాత్రి సమయంలో కనపడక మ్యాన్‌హోల్‌లో పడి గాయాలైన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో స్థానికులు వాటిపై కట్టె చెక్కలు అడ్డుగా వేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు

ఇద్దరికి గాయాలు

గచ్చిబౌలి: హోటల్‌లో గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..గచ్చిబౌలిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో కిరణ్ అనే వ్యక్తి హంగ్రీ ఇడ్లీ పేరిట హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్‌లో పని చేసే వంటమనుషులు రాజీవ్(35), శంకర్(23) శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో హోటల్‌కు వచ్చారు. స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగి గాయాల బారినపడ్డారు. గ్యాస్ లీక్ కావడం గుర్తించకుండా లైటర్‌తో స్టవ్ వెలిగించగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న రాజీవ్‌కు 30 శాతం, శంకర్‌కు 39 శాతం పొట్ట, కాళ్లు, చేతులకు కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య సమ్మేళనం





కళాకారుల నృత్యాలు

మాదాపూర్: కళాకారులు నృత్య సమ్మేళనంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి నృత్య సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కథక్, భరతనాట్యం, మణిపురి, పేరిణి, ఒడిసి నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మోహన్‌రెడ్డి కథక్ నృత్యంలో శివద్రుపద్, తరణ అంశాలను, సుగమ్య భరతనాట్యంలో బంటురీతి, ముద్దుగారే యశోధ, నందిచాలా అంశాలను, ఎస్‌కె బాద్షా మణిపురిలో దశావతారంను, సాయికుమార్, సాయిసంతోష్ పేరిణి శివతాండవంలో మేళాప్రాప్తి, అకాశసమీకరణం, శ్రీరామ కౌండిన్య, కూచిపూడి నందకనంద గోపాల, సత్యప్రకాశ్ ఒడిసిలో సూర్యాష్టకం, రవి శిష్యబృందంచే కూచిపూడిలో మహాగణపతిం, నమఃశివాయ తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. అనంతరం కళాకారులను రవి ఘనంగా సత్కరించారు.

కంచెను తొలగించిన వారిపై కేసు



జేసీబీతో కంచెను తొలగిస్తున్న దృశ్యం

మియాపూర్: మియాపూర్‌లోని సర్వేనంబర్ 100, 101 భూమిలో ఏర్పాటు చేసిన కంచె తొలగించి ఆక్రమణలకు యత్నించిన ఇద్దరు వ్యక్తులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, హెచ్ఎండీఏ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌లోని 100, 101లో సుమారు 551 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి గత దశాబ్దాల కారణంగా కోర్టులో వివాదం కొనసాగుతుంది. 2003లో ఈ భూమి ప్రభుత్వ భూమి అని హైకోర్టు తీర్పు ఇవ్వగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ భూములు మావేనని సుప్రీంకోర్టులో దావా వేశారు. ప్రస్తుతం ఈ భూమిపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతుంది. గత కొన్ని రోజుల క్రిందట ఈ భూమి కబ్జాచేసేందుకు యత్నిస్తుండగా హెచ్ఎండీఏ అధికారులు 100, 101 సర్వేనంబర్ భూమి చుట్టు కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు మియాపూర్ ఎంఏనగర్ కాలనీ సమీపంలో జేసీబీ సాయంతో కంచెను తొలగించి భూమిని ఆక్రమించే ప్రయత్నం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హెండా సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించి కంచె తొలగించి ఆక్రమణకు పాల్పడుతున్న వెంకటేశ్వర్‌రావు, జేసీబీ డ్రైవర్ దత్తు, మరికొంత మందిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు వెంకటేశ్వర్‌రావు, జేసీబీ డ్రైవర్ దత్తు, మరికొంత మందిపై కేసు నమోదు చేసి, జేసీబీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకున్న జీహెచ్ఎంసీ

- నోటీసు ఇవ్వకుండా వస్తువులు పడేయడం సరికాదంటున్న నిర్వాహకులు
- కాంప్లెక్స్ లీజు ముగిసిందన్న అధికారులు



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని వస్తువులను బయట పడేస్తున్న సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ 6వ ఫేజ్‌లోని జీహెచ్ఎంసీ మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లీజ్ గడువు ముగిసిందని మూసాపేట సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ, ఇంజినీరింగ్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ రమేశ్, ఏఈ సాయి ప్రసాద్, జోన్ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ వీరానంద్‌ల బృందం శనివారం కేపీహెచ్‌బీ కాలనీలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. వారికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి విద్యుత్ కనెక్షన్ తొలగించి వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో అందులోని కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, కుర్చీలు, బెంచీలు, టేబుల్స్ లాంటి పరికరాలను జిమ్‌లోని వస్తువులను రోడ్డున పడేశారు. అలాగే ఈ భవనంలో కొనసాగుతున్న కేపీహెచ్‌బీకాలనీ ఆరో ఫేజ్ రెసిడెన్సీ, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్‌కు తాళం వేశారు. 50 శాతం మేర వస్తువులను తొలగించారు. మిగిలిన వస్తువులను రేపటిలోగా తొలగించి ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోయారు.

నోటీసులు ఇవ్వకుండా రోడ్డున పడేశారు..

జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిబంధనల ప్రకారం కొనసాగిస్తున్నామని, జీహెచ్ఎంసీ లీజు గడువు మార్చి 12 వరకు ఉండగా.. దీనిని మరల తమకు కేటాయించాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకోవడం జరిగిందని స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వాహకులు అభిషేక్‌రెడ్డి, సాయికుమార్ గౌడ్, బాల్‌చందర్ రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేశామని, ఇప్పుడు వచ్చి వెళ్లిపోమంటే తమ పరిస్థితి ఏంటని అన్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను, ప్రభుత్వ పెద్దలను కలిసి న్యాయం చేయాలని కోరనున్నట్లు తెలిపారు.